


పత్తికొండకు రా.. కదలిరా..


సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు, కుర్చీలు

- లక్ష మందితో నేడు భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు
- గోపాల్‌ప్లాజాలో బస చేయనున్న చంద్రబాబు

కర్నూలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి)/ పత్తికొండ: పత్తికొండలో రా.. కదలిరా కార్యక్రమం ఆదివారం జరగనుంది. ఇందుకోసం నాయకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. దాదాపు లక్ష మందితో సభను విజయవంతం చేసేందుకు మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, కేఈ ప్రభాకర్, మాజీ మంత్రి అఖిలప్రియ దగ్గరుండి సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. చంద్రబాబు సభకు ఆదోని రహదారిలో టీడీపీ నాయకుడు ప్రమోద్‌కుమార్ వెంచర్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. వేదికతోపాటు హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కూర్చునేందుకు కుర్చీలను ఏర్పాటు చేశారు. బారీకేడ్ల ద్వారా మహిళలకు, వీవీఐపీ, వీఐపీ, మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా గ్యాలరీలను విభజించారు. సభా స్థలానికి సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. 200 మీటర్ల దూరంలో ఉన్న హెలిప్యాడ్ నుంచి వాహనంలో చంద్రబాబు వేదిక వద్దకు చేరుకుంటారు. హెలిప్యాడ్ ఏర్పాట్లను ఆర్డీవో రామలక్ష్మి పరిశీలించగా ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు మార్కింగ్‌ను ఇచ్చి అనుమతులు మంజూరు చేశారు.

200 మంది పోలీసులతో బందోబస్తు..

బహిరంగ సభ ఏర్పాట్లతోపాటు హెలిప్యాడ్‌ను డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. కేఈ శ్యాంబాబు, అఖిలప్రియలు బహిరంగ సభ నిర్వహణపై ఆయనతో చర్చించారు. వాహనాల పార్కింగ్, వీవీఐపీల ఎంట్రీ గురించి మాట్లాడారు. బహిరంగ సభ కోసం 200 మంది పోలీసులకు విధులు కేటాయించారు. ఏర్పాట్ల పరిశీలనలో డీఎస్పీతోపాటు సీఐ మురళీమోహన్ ఉన్నారు.

నాయకులంతా అక్కడే..

పత్తికొండ సభను సక్సెస్ చేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జిలు కేఈ శ్యాంబాబు, మీనాక్షినాయుడు, కోట్ల సుజాతమ్మ, బీవీ జయనాగేశ్వరరెడ్డి, తిక్కారెడ్డి, గౌరు చరిత, టీజీ భరత్, ఆకెపోగు ప్రభాకర్ తదితరులు కృషి చేస్తున్నారు. ప్రతి మండలం, పల్లె నుంచి చలో పత్తికొండకు పిలుపునిచ్చారు. అదే క్రమంలో మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబుతోపాటు జిల్లా సమన్వయకర్త ప్రభాకర్ చౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి ఆధ్వర్యంలో సభా ఏర్పాట్లు పూర్తి చేశారు.

చంద్రబాబు పర్యటన వివరాలు ఇలా..

చంద్రబాబు నాయకుడు నెల్లూరు నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3:50 గంటలకు పత్తికొండకు చేరుకుంటారు. 3:55 గంటలకు హెలిప్యాడ్ నుంచి వాహనంలో బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. 4 గంటలకు వేదికపైకి చేరుకుని 5:50 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. 6 గంటలకు హంద్రీనీవా సమీపంలో ఉన్న గోపాల్‌ప్లాజాకు చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు. 29వ తేదీ ఉదయం 9:30 గోపాల్‌ప్లాజా నుంచి వాహనంలో హెలిప్యాడ్ వద్దకు బయలుదేరుతారు. 9:40 గంటలకు హెలికాప్టర్‌లో కర్నూలు ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు. 10 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్టులో దిగి అక్కడి నుంచి 10:05 గంటలకు విమానంలో రాజమండ్రికి వెళ్తారు.

పత్తికొండకు తరలి రండి

టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి దీపక్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న దీపక్ రెడ్డి, బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జనవరి 27: పత్తికొండలో నిర్వహిస్తున్న చంద్రబాబు సభకు తరలి రావాలని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి దీపక్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను వైసీపీ ద్రోహం చేసిందని అన్నారు. కోట్లాది రూపాయల ధనాన్ని తన ప్రచారం కోసం జగన్ ఉపయోగించుకుని రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చి వేశారని దుయ్యబట్టారు. సమావేశంలో టీసీ సెల్ నాయకులు సత్రం రామకృష్ణ, తిరుపాలుబాబు, హనుమంతరాయచౌదరి, కార్పొరేటర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ గద్దె దిగిపోవడం ఖాయం

మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి

పత్తికొండ టౌన్, జనవరి 27: సీఎం జగన్మోహన్‌రెడ్డి గద్దె దిగిపోవడానికి సిద్ధమయ్యారని మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి అన్నారు. శనివారం పత్తికొండలోని ప్రమోద్‌కుమార్‌రెడ్డి వెంచర్‌లో నిర్వహించే రా కదలి రా చంద్రబాబు పర్యటన సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ పాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. తాను ఉప ముఖ్యమంత్రి ఉన్న సమయంలో పత్తికొండ నియోజకవర్గంలోని చెరువులకు నీరు మళ్లించడంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని గుర్తు చేశారు. రాష్ట్రంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలన గురించి ప్రజలకు వివరించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పత్తికొండకు వస్తున్నారని తెలిపారు. బహిరంగ సభకు లక్ష మందికి పైగా జనం వస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వైసీపీని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు కూడా సిద్ధమయ్యారన్నారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ చంద్రబాబు పత్తికొండకు చాలా ప్రాధాన్యత ఇస్తారని, అందుకే కర్నూలు పార్లమెంటరీ పరిధిలో పత్తికొండనే ఎంచుకున్నారని అన్నారు. వచ్చే ఎన్నికలలో కర్నూలు పార్లమెంటరీ సభ, ఏడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుని చంద్రబాబుకు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మాట్లాడుతూ పత్తికొండలో తలపెట్టిన చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. వేలాదిగా తరలి వచ్చే జనానికి ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్, భోజనం, నీటి వసతులలో లోటుపాట్లు లేకుండా చూస్తామని చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు, ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భార్గవ్, వలసల రామకృష్ణ, తిరుపాలునాయుడు, బత్తిన లోక్‌నాథ్, అశోక్‌కుమార్, గురుస్వామి, మనోహర్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ కేఈ కృష్ణమూర్తి


అశేష జనవాహిని నడుమ సాగుతున్న రథోత్సవం

జయ జయ శంకర..

- ఉత్సాహంగా నీలకంఠేశ్వరుడి రథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

ఎమ్మిగనూరు, జనవరి 27: భక్తుల శివనామస్మరణ మధ్య నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా సాగింది. భక్తులు భారీగా తరలి రావడంతో తేరుబజారు ప్రాంతం జనసంద్రమైంది. రథ వీధులన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. వేదపండితులు వేదమంత్రాలను వల్లిస్తుండగా ఆదిదంపతులను భక్తి శ్రద్ధలతో.. వేదమంత్రాలతో మహారథంపైకి చేర్చారు. రథోత్సవ ముహూర్తం ప్రారంభం కాగానే ఒక్కసారిగా వేలమంది భక్తులు హరోం..హర.. శంభోశంకరా.. జయహో నీలకంఠేశ్వరా.. అంటూ నినదించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ధర్మకర్త ఎద్దులింటి మురళీధర్ ఆధ్వర్యంలో ఆలయం నుంచి ఉత్సవమూర్తులను పల్లకిలో రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మేళతాళాలతో గడిగే చెన్నప్ప కుటుంబీకులు కుంభం తీసుకొచ్చారు. రథ చక్రాలు మార్కండేయుడి గుడివైపు 6:05గంలకు కదిలాయి. 6:10 గంటలకు మార్కండేయుడి సన్నిధానానికి రథం చేరింది. అక్కడ పూజలు చేసి 6:26 గంటలకు రథం యథాస్థానానికి చేరడంతో రథోత్సవం ముగిసింది.


రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


యువకుల కోలాహలం

రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు..

నీలకంఠేశ్వరస్వామి రథోత్సవంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మాజీ ఎంపీ బుట్టారేణుక, వైసీపీ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, ధరణీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణరెడ్డి, మంత్రాలయం టీడీపీ రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జనసేన ఇన్‌చార్జి రేఖాగౌడ్, తెలుగుయువత దివాకర్ రెడ్డి, ఎంజీ కుటుంబీకులు డాక్టర్ మాచాని సోమనాథ్ , మాచాని శివశంకర్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దారు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య పర్యవేక్షణలో సీఐలు మధుసూదన్‌రావు, మోహన్ రెడ్డి ఎస్‌ఐలు బందోబస్తును నిర్వహించారు.


పీఠాధిపతికి తులాభారం



మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు కర్ణాటకలోని శిరిగుంప ఆర్యవైశ్య పాదయాత్ర మండలి బృందం సభ్యులు పీఠాధిపతికి భారీ ఊరేగింపు, తులాభారం అభిషేకాలు నిర్వహించారు. శనివారం రాత్రి పీఠాధిపతిని ప్రత్యేక వాహనంలో రాఘవేంద్ర సర్కిల్ నుంచి శ్రీమఠం మధ్వమార్గ్ కారిడార్ మీదుగా శ్రీమఠానికి చేరుకుని డ్రై ఫ్రూట్స్‌తో తులాభారం వేశారు. -మంత్రాలయం

జయహో బీసీకి జై

- గ్రామాల్లో విస్తృతంగా పర్యటనలు
- టీడీపీ కార్యక్రమానికి విశేష ఆదరణ
- బీసీలతో మమేకమవుతున్న నాయకులు
- వైసీపీ విధానాలను ఎండగడుతున్న వైనం





కర్నూలు(అర్బన్), జనవరి 27: జగన్‌ను ఇంటికి పంపేందుకు బీసీలు సిద్ధమయ్యారా.. కూడు, గూడు, నీడ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారా.. ప్రస్తుత పరిణామాలు అవుననే చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 68 శాతం బీసీ జనాభా ఉండడంతో రెండు జిల్లాల టీడీపీ అధ్యక్షులను ఆ సామాజిక వర్గానికి చెందిన వారినే అధిష్ఠానం నియమించింది. ఈ నిర్ణయంతో టీడీపీకి మరింత బలం చేకూర్చినట్టయింది. దీనికి తోడు జిల్లాలో నెల రోజులుగా గ్రామ గ్రామాన జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి బీసీని పలకరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. వైసీపీ పాలనలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తున్నారు. దీంతో బీసీలంతా ఏకమై ఈ సారి టీడీపీకి అండగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఆదివారం పత్తికొండలో జరగనున్న రా.. కదిలి .. రా కార్యక్రమానికి బీసీలు భారీగా తరలి రానున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు తెలిపారు.

బీసీలకు ప్రాధాన్యత పదవులు..

ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల చూపంతా ఓటర్లలో అత్యధిక శాతం ఉన్న బీసీలపైనే పడింది. మొదటి నుంచి బీసీల పార్టీగా గుర్తింపు ఉన్న టీడీపీ ఈ విషయంలో మరింత ముందంజలో ఉందనే చెప్పవచ్చు. ఇందులో భాగంగానే కీలకమైన కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిని వాల్మీకి కులానికి చెందిన బీటీ నాయుడికి, నంద్యాల జిల్లా అధ్యక్ష పదవీని గౌడ కులానికి చెందిన మల్లెల రాజశేఖర్‌గౌడ్‌లకు అప్పగించారు. రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్‌గా యాదవ కులానికి చెందిన నాగేశ్వరావు యాదవ్‌ను నియమించారు. మరో నేత నరసింహులు యాదవ్‌కు రాష్ట్ర కార్యదర్శితోపాటు హిందూపురం పార్టీ పరిశీలకునిగా పార్టీ అధిష్ఠానం నియమించింది.



కర్నూలు జిల్లాలో బీసీలు ఎక్కువ..

రానున్న ఎన్నికల్లో బీసీల ఓటు బ్యాంకును సాధించేందుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జయహో బీసీ కార్యక్రమాన్ని చేపట్టారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలతో పోలిస్తే కర్నూలు జిల్లాలో బీసీల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇదే విషయాన్ని ఇటీవల ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ల జాబితా స్పష్టం చేస్తోంది. అయితే బీసీల మద్దతు పొందాలంటే వారికి సంబంధించిన కార్యక్రమాలు రూపొందించుకొని విజయవంతం చేయాల్సిన అవసరం ఉంది. అధికారంలోకి తెలుగుదేశం పార్టీ వస్తేనే భవిష్యత్ బాగుంటుందనే నమ్మకం వారిలో కలిగేలా కార్యాచరణ ఉండాలి. బీసీలను కలుపుకొని ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై ఇప్పటికే పార్టీ అధినాయకుడు చంద్రబాబు నాయుడు నిర్దేశించారని జిల్లా పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు.

వైసీపీ పాలనలో నిర్వీర్యం..

వైసీపీ పాలనలో బీసీ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ఐదేళ్లు పూర్తి కావస్తున్నా వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేసింది ఏమీ లేదన్న విషయాన్ని తెలియజేసేందుకు తెలుగు దేశం పార్టీ జయహో బీసీ కార్యక్రమాన్ని తలపెట్టింది. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు, ఖర్చు చేసిన నిధులపై ప్రజలకు వివరించేందుకు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పర్యటిస్తున్నారు. బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పగా చెప్పుకుంటున్నా ప్రభుత్వం వాటికి ఏ మాత్రం నిధులు కేటాయించలేదు. ప్రశ్నించిన బీసీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ నాయకులు అక్రమ కేసులు పెట్టిస్తున్నారు. దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. స్థానిక సంస్థల పదవుల్లో రిజర్వేషన్లు టీడీపీ 34 శాతం కొనసాగిస్తే వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి కుదించింది. అదేవిధంగా పార్టీలో ప్రాధాన్యతా పదవులన్నీ జగన్‌రెడ్డి తన సామాజిక వర్గానికే చెందిన వారికి కట్టబెట్టడం ఏమాత్రం విలువ లేని పదవులను బీసీలకు కేటాయించారు. టీడీపీ చేపట్టిన జయహో బీసీ కార్యక్రమంలో ఈ విషయాలన్ని వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.

టీడీపీ వైపు ప్రజలు...

జయహో బీసీ సభలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి రావాలని అన్ని వర్గాల వారు కోరుకుంటున్నారు. బీసీలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాల హక్కులన్నీ హరించేశాడు. ఇక జగన్ రెడ్డి పని అయిపోయింది. ఆయన్ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. జగన్‌ను ఇంటికి పంపేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారు. అందుకే జయహో బీసీ సభలు ఎక్కడ పెట్టినా ప్రజలు భారీగా తరలివస్తున్నారు.



\- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

బీసీల్లో చైతన్యం తెస్తాం



వైసీపీలో బీసీలకు విలువ లేకుండా పోయింది. వైసీపీ బస్సు యాత్రలో బీసీలకు విలువ లేదని కర్నూలు వైసీపీ ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ వెల్లడించారు. బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా క్రిష్ణ మూర్తిని సైతం మెడపట్టి బయటకు గెంటేశారు. మరో ఎమ్మెల్యే పార్థసారధి విజయవాడ సొంత స్థలం ఇచ్చి వైసిపి కోసం పని చేస్తే విలువ ఇవ్వలేదు., ఇలాంటి నాయకులను ఉదాహరణలు చూపుతూ బీసీల్లో చైతన్యం తెస్తున్నాం. టీడీపీ పేద బడుగు బలహీన వర్గాల పార్టీ మొదటి నుంచి ప్రాధన్యాత ఇస్తూ ఎందరికో అత్యున్నత పదవుల్లో కూర్చో పెట్టిన పార్టీ. తెలుగుదేశం. అందుకే టిడిపికి మద్దతోనే బీసీలకు న్యాయం జరుగుతుంది

\-వై.నాగేశ్వరావు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్

జయహో బీసీకి నీరాజనం



జయహో బీసీ కార్యక్రమానికి ఎక్కడ చూసినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బీసీలకు వెన్ను దన్నుగా నిలిచే పార్టీ టీడీపీ అని బీసీ సామాజిక వర్గం గుర్తించింది. ఇక రానున్న ఎన్నికల్లో బీసీలు టీడీపీకి మద్దతుగా నిలువబోతున్నారు. చంద్రబాబు, లోకేశ్ నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఎదురు చూస్తున్నారు.

\- సత్రం రామకృష్ణుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు

టీడీపీతోనే బీసీలకు న్యాయం



టీడీపీలోనే బీసీలకు రాజకీయం ప్రాధాన్యత ఉంటుంది. ఉపాధి అవకాశాలు, సంక్షేమం కూడా తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను బీసీలకు వివరిస్తున్నాం. జయహో బీసీ కార్యక్రమం ద్వారా వారిలో చైతన్యం వస్తోంది. గ్రామ గ్రామాన ప్రజలు చంద్రబాబు, లోకేశ్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు.

\- కాసాని మహేష్ గౌడ్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి

రూ.11 కోట్లతో సీ.క్యాంపు రైతుబజారు విస్తరణ

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 27: గుర్తింపు పొందిన కర్నూలు నగరంలోని సీ క్యాంపు రైతుబజారు ఇబ్బందులు తొలగనున్నాయి. ప్రతి రోజూ కూరగాయలు కొనుగోలు చేసేందుకు నగరంలోని అన్ని కాలనీల నుంచి దాదాపు ఐదు వేల నుంచి ఏడు వేల మంది వినియోగదారులు సీ క్యాంపు రైతు బజారుకు వస్తున్నారు. గత టీడీపీ హయాంలో రైతుబజారుకు సమీపంలోనే ఉన్న రెవెన్యూ క్వార్టర్స్‌లోని పది బిల్డింగులను విస్తరణ కోసం కేటాయించారు. విస్తరణ కోసం రూ.5 కోట్లను కేటాయించారు. రెవెన్యూ క్వార్టర్స్‌ను కూలగొట్టి విస్తరణ పనులు చేపట్టాలంటే ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలకు రూ.5 కోట్ల నిధులు ఏ మాత్రం చాలవని మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారు. తాజాగా సీ క్యాంపు రైతుబజారు విస్తరణ పనుల కోసం రూ.11 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బారెడ్డి తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు అందగానే ముందుగా రెవెన్యూ క్వార్టర్స్‌ను తొలగించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని, వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు వెంటనే చేపడతామని తెలిపారు. ఈ పనులు వెంటనే జరిగినట్లయితే.. వాహనాలన్నీ కూరగాయల కోసం వచ్చే ప్రజలు పార్కింగ్ స్థలంలోనే ఉంచుకునే అవకాశం ఉంటుంది. రద్దీ తగ్గి దొంగల బెడద కూడా తొలగే అవకాశం ఉంటుంది.

జేవీకే నిధులలో అవినీతిపై విచారణ

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 27: జేవీకే నిధులలో ఎంఈఓ అంజనేయులు అక్రమాలకు పాల్పడ్డారన్న విద్యార్థి సంఘాల ఆరోపణలపై డిప్యూటి డీఈఓ వెంకటరమణారెడ్డి, ఆదోని ఎంఈఓ, ప్రజెంటింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు విచారణ శనివారం చేపట్టారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ జడ్పీ ఉన్నతపాఠశాలలో వారు జేవీకే నిధులు మంజూరు, ఎంఈఓ చేసిన ఖర్చులపై బిల్లులను పరిశీలించారు. బిల్లులో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికరులకు నివేదిక పంపుతామని విచారణకు వచ్చిన అధికారులు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, ఉదయ్,రామకృష్ణ, శేఖర్ డిమాండ్ చేశారు.

దోచుకోవటం.. దాచుకోవడమే జగన్ నైజం

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

పెద్దకడుబూరు, జనవరి 27: సీఎం జగన్ ఈ ఐదేళ్లలో దోచుకోవటం.. దాచుకోవటం తప్ప ప్రజలకు చేసిందేమి లేదని శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. శనివారం మండలకేంద్రమైన పెద్దకడుబూరులో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జీ పాలకుర్తి తిక్కారెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో సీఎం జగన్ ఘోరంగా విఫలమయ్యాడన్నారు. పత్తికొండలో జరిగే రా.. కదలిరా.. సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు అబ్బర్వర్ శివబాల, టీడీపీ నాయకులు రమాకాంత్‌రెడ్డి, బసలదొడ్డి ఈరన్న, ఏసేపు, దశరథరాముడు, మల్లికార్జున, మీసేవ ఆంజనేయులు, వీరేష్ గౌడ్‌లు పాల్గొన్నారు.

కర్నూలు ఎంపీడీవో ఆజామ్‌ఖాన్ మృతి



అజాంఖాన్ (ఫైల్)

కర్నూలు(రూరల్), జనవరి 27: కర్నూలు ఎంపీడీవో కేఏ ఆజామ్‌ఖాన్(61)గుండెపోటుతో మృతి చెందారు. కర్నూలులో విధులు నిర్వహిస్తున్న ఆయన శనివారం కూడా వేకువ జామున 5గంటల ప్రాంతంలో డోన్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రైలు కోసం వేచిచూస్తున్న సమయంలో గుండెపోటు వచ్చి అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే అక్కడే ఉన్న రైల్వే పోలీసులు ఆయన వద్దకు చేరుకుని ఎంపీడీవో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆజామ్‌ఖాన్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎంపీడీవోకు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎంపీడీవో స్వస్థలం శిరివెళ్ల. ఉద్యోగరీత్యా ఆయన డోన్‌లో స్థిరపడ్డారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఎంపీడీవోల బదిలీల జాబితాలో ఆజామ్‌ఖాన్‌ను అనంతపురం జిల్లాకు కేటాయించినట్లు సిబ్బంది తెలిపారు. మరో రెండు రోజుల్లో రిలీవ్ కానున్న తరుణంలో ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరమని కార్యాలయం సిబ్బంది తెలిపారు. జడ్పీ సీఈవో నారసరెడ్డి ఆజామ్‌ఖాన్ భౌతికాయానికి నివాళి అర్పించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

కోసిగి, జనవరి 27: మండల కేంద్రంలోని 9వ వార్డుకు చెందిన వడ్డె రాముడు (40) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. భార్య ఉలిగమ్మ, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. వడ్డె రాముడు మధ్యాహ్నం 2 గంటల సమయంలో రైల్వే గేటు సమీపంలోని బహిర్భూమికి వెళ్లాడు. 4 గంటలైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు రైల్వేగేటు వద్దకు వెళ్లి చూడగా అక్కడ బోర్లా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. ఎస్‌ఐ సతీష్ కుమార్ అనుమానాస్పద స్థితి మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు, భార్య ఉలిగమ్మలు మాత్రం తన భర్తను హత్య చేశారని ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య ఉలిగమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్రీడా పోటీలు

రవాణా రోడ్డు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న



సోమయాజులపల్లెలో పాఠశాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, కలెక్టర్ డా.జి.సృజన

ఓర్వకల్లు, జనవరి 27: యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ద్వారా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని జిల్లా స్పెషల్ ఆఫీసర్, రవాణా రోడ్డు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న అన్నారు. శనివారం మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర, పాణ్యం నియోజకవర్గ స్థాయి క్రీడా కార్యక్రమంలో సెక్రటరీ, కలెక్టర్ డా.జి.సృజనతో కలిసి పాల్గొన్నారు. అనంతరం సోమయాజుల పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గ ప్రత్యేక అధికారి డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి బౌలింగ్ చేయగా.. ప్రిన్సిపల్ సెక్రటరీ బ్యాటింగ్ చేసి యువతలో స్ఫూర్తిని నింపారు. గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీలను ప్రదానం చేశారు. క్రికెట్ పోటీల్లో మూడు టీములు పాల్గొనగా.. కర్నూలు నగరానికి చెందిన టీం మొదటి స్థానం, గడివేముల జట్టు రెండో స్థానం, పాణ్యం టీమ్ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. సోమయాజులపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించ్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా.. గుడ్డు, చిక్కీలు అందు తున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే 8వ తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి స్మార్ట్ బోర్డు ద్వారా ఏవిధంగా బోధిస్తున్నారో పరిశీలించారు. విద్యార్థులకు అందించిన ట్యాబుల వినియోగంపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, డీటీసీ శ్రీధర్, డీఈవో రంగారెడ్డి, ఎస్‌ఎస్‌ఏ పీవో విజయజ్యోతి కుమారి, సెట్కూరు సీఈవో పీవీ రమణ, సర్పంచ్ జయమ్మ, తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో శివనాగప్రసాద్ పాల్గొన్నారు.

రేపు వైఎస్ షర్మిల రాక



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు

కర్నూలు(అర్బన్), జనవరి 27: జిల్లాల పర్యటనలో భాగంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం కర్నూలు జిల్లాకు రానున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నంద్యాల, కర్నూలు జిల్లాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ, బాబురావు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29వ తేదీ సోమవారం నగరంలోని తనిష్క ఫంక్షన్ హాలులో కర్నూలు, నంద్యాల జిల్లాల కార్యకర్తలు, కీలక నాయకులతో సమీక్ష ఉంటుందన్నారు. ముందుగా నంద్యాల చెక్‌పోస్టు నుంచి సీ క్యాంప్, కలెక్టరేట్ రాజవిహార్ మీదుగా తనీష్ ఫంక్షన్ హాలు వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. పీసీసీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, 14 నియోజవర్గాల కోఆర్డినేషన్ కమిటి సభ్యులు, మండల అధ్యక్షులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు

మంత్రాలయం, జనవరి 27. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీమఠం కిక్కిరిసింది. ఈ నెల ఆఖరి శనివారం కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మహాముఖ ద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కళాశాల విద్యార్థిని మృతిపై విచారణ

పాణ్యం, జనవరి 27: జిల్లాలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన విద్యార్థిని ప్రసవం, మృతి సంఘటనపై విచారిస్తున్నట్లు నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థిని కళాశాలలో మూడు నెలల క్రితం రెండో సంవత్సరంలో చేరిందన్నారు. ఈనెల 23న సంక్రాంతి సెలవుల అనంతరం తల్లిదండ్రులు విద్యార్థినిని కళాశాల హాస్టల్‌లో వదలి వెళ్లారని తెలిపారు. 26వ తేదీన విద్యార్థిని కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులకు కళాశాల సిబ్బంది సమాచారం ఇచ్చారని వివరించారు. తల్లిదండ్రులు వచ్చేలోపు బాత్‌రూంలోకి వెళ్లి తలుపు వేసుకొని ప్రసవించిందని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థినిని సమీప శాంతిరాం ఆసుపత్రికి తరలించి అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. విద్యార్థినికి తీవ్ర రక్తస్రావంతో కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఐలు రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలు న్యాయవాది



కెంగార కుమార్

కర్నూలు(లీగల్), జనవరి 27: ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన న్యాయవాది కెంగార కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం విజయవాడలో జరిగిన ఐలు రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఇంత వరకు ఈయన ఐలు రాష్ట్ర కోశాధికారిగా, కేంద్ర కమిటి సభ్యుడిగా పని చేశారు.

మహిళా జైలు తనిఖీ



ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు(లీగల్), జనవరి 27: స్థానిక మహిళా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. అక్కడ మహిళా ఖైదీలకు అందిస్తున్న భోజన వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అదేవిధంగా స్థానిక మార్కెట్ యార్డులో హమాలీ కార్మికులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు ఈశ్రమ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివుడు, లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.43.20 లక్షలు స్వాధీనం

క్రిష్ణగిరి, జనవరి 27: వాహనాల తనిఖీలు చేస్తుండగా మండల పరిధిలోని అమకతాడు టోల్‌ప్లాజా వద్ద రూ.43.20 లక్షలు పట్టుబడ్డాయి. సీఐ సురేష్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు క్రిష్ణగిరి, వెల్దుర్తి పోలీసులు శనివారం రాత్రి హైదరాబాదు నుంచి అనంతపూర్‌కు వెళుతున్న ప్రైవేటు బస్సును ఆపి తనిఖీ చేశారు. అందులో ప్రయాణిస్తున్న ఎర్రగుడి సాయిప్రదీప్ వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.43.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. క్రిష్ణగిరి ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకున్నారు. ఈ దాడులలో వెల్దుర్తి ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తన సిబ్బందితో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, జనవరి 27: కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గ్రామ సమీపంలో మోటారు సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. అవుకు మండలం చెర్లోపల్లె గ్రామానికి చెందిన కంబగిరి (39) కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లెకు బైక్‌పై వెళ్తున్నాడు. బెలుం సమీపంలోకి రాగానే తాడిపత్రి నుంచి బనగానపల్లెకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కంబగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్‌రెడ్డి తెలిపారు.

కర్నూలులో హనీ ట్రాప్

- హైదరాబాద్ బిల్డర్‌ను కర్నూలుకు పిలిపించి దోపిడీ
- ఏడుగురు అరెస్టు.. మరో ముగ్గురి కోసం గాలింపు

కర్నూలు, జనవరి 27: సోషల్ మీడియా వేదికగా ఓ యువతి ద్వారా హనీ ట్రాప్ చేసి దోపిడీకి పాల్పడిన ఘటన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హైదరాబాదుకు చెందిన బిల్డర్ శివారెడ్డికి వరంగల్లుకు చెందిన ఓ యువతితో గతంలో పరిచయం ఉంది. ఆమెతో కొంత కాలం కలిసి మెలిసి తిరిగాడు. ఆ తర్వాత ఆమెను వదిలేయడంతో ఆ యువతి కర్నూలుకు చెందిన శ్రీనివాసరెడ్డితో పరిచయం పెంచుకుంది. శ్రీనివాసరెడ్డిని పెళ్లి చేసుకున్నట్లు సమాచారం ఉండటంతో శివారెడ్డి ఆ యువతిని బ్లాక్‌మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. గతంలో తన దగ్గర ఉన్న వీడియోల ద్వారా బెదిరింపులకు పాల్పడుతుండటంతో ఆ యువతి శ్రీనివాసరెడ్డికి చెప్పింది. దీంతో మనసులో పెట్టుకున్న శ్రీనివాసరెడ్డి.. అనూరెడ్డి అనే మరో యువతి ద్వారా సోషల్ మీడియా వేదికగా శివారెడ్డిని హనీ ట్రాప్ చేశారు. శివారెడ్డి పూర్తిగా ప్రేమలో మునిగాడని తెలుసుకున్నాక కర్నూలుకు పిలిపించారు. కర్నూలు అబ్బాస్ నగర్‌లోని ఓ గదికి పిలిపించి కొట్టారు. ఆ తర్వాత ఇద్దరు హిజ్రాల సాయంతో శివారెడ్డి ఆమెతో ఉన్నట్లుగా బెదిరించి ఫొటోలు తీయించుకున్నారు. ఆ తర్వాత అతని వద్ద రిస్టి వాచ్, బంగారు చైన్ తీసుకున్నారు. వీటితో పాటు కొన్ని ప్రామిసరి నోట్లు కూడా రాయించుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత హిజ్రాలతో ఉన్న ఫొటోలు కూడా చూపించి మరోసారి బ్లాక్‌మెయిల్ చేసినట్లు సమాచారం. దీంతో శివారెడ్డి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శ్రీనివాసరెడ్డిని, అనూరెడ్డిని, వీరికి సహకరించిన ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఇద్దరు హిజ్రాలు, మరో యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరందరిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. వీరికి సహకరించిన మరో యువతి, ఇద్దరు వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. పూర్తి విషయాలు పోలీసులు మరో రెండు రోజుల్లో వెల్లడించే అవకాశం ఉంది.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

రైతులు లేని రైతుబజార్లు

» వ్యాపారులదే ఇష్టారాజ్యం
» అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు
» ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 27: రైతు బజారులు రైతుల కోసం ఏర్పాటు చేశారు. రైతులు తాము పండించిన కూరగాయలను నేరుగా ప్రజలకు తక్కువ ధరకే విక్రయించి, దళారుల, వ్యాపారుల బెడద లేకుండా లాభాలు పొందడం వీటి లక్ష్యం. గత టీడీపీ హయాంలో రైతుబజార్లు ఏర్పాటయ్యాయి. మొదట్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు నగరంలో సీ.క్యాంపు రైతుబజారు, కొత్తపేటలో, అమీన్ అబ్బాస్ నగర్‌లలో రైతు బజార్లను ఏర్పాటు చేశారు. ఆదోని, నంద్యాల పట్టణాల్లోనూ వీటిని నెలకొల్పారు. క్రమక్రమంగా ఈ రైతుబజార్లలో రైతులను పక్కకు తప్పించి వ్యాపారులకే పెద్దపీట వేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. షాపుల కేటాయింపులో పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుంటున్నారన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. సీ.క్యాంపు రైతుబజారులో సగటున ప్రతి రోజు ఆరేడువేల మంది వినియోగదారులు కూరగాయలు కొనడానికి వస్తుంటారు. కొత్తపేట, అమీన్‌అబ్బాస్ నగర్ రైతుబజార్లకు మరో 2 వేల మంది వస్తున్నారు. గత టీడీపీ హయాంలో ఈ రైతుబజార్లకు ఇచ్చిన ప్రాధాన్యత ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం ఇవ్వడం లేదని, అందువల్లనే తమకు రైతుబజార్లల్లో కూరగాయలు అమ్ముకునేందుకు అవకాశం లేకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాస్తో.. కూస్తో సీ.క్యాంపు రైతుబజారులో వివిధ గ్రామాల నుంచి రైతులు కూరగాయలు తీసుకు వచ్చి అమ్ముకుంటున్నారు. కొత్తపేట, అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజార్లలో, నంద్యాల, ఆదోని నగరాల్లోని రైతుబజార్లల్లో పూర్తిగా వ్యాపారులే తిష్ట వేశారు. బయటి మార్కెట్ ధరలకు ఏ మాత్రం తగ్గకుండా ఈ రైతుబజార్లల్లో వ్యాపారులు పోటాపోటీగా ధరలు పెంచి కూరగాయలు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు నగరంలోని రైతుబజార్లల్లో మాన్యువల్ కాటాలు తప్ప.. ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగంలో లేవు. దీని వల్ల అసలే మండిపోతున్న కూరగాయలకు తోడు తక్కువ తూకంతో కూరగాయలను విక్రయిస్తున్నారని, దీని వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.5కోట్ల ఖర్చుతో పాడుబడిన రెవెన్యూ క్వాటర్స్‌ను సీ. క్యాంపు రైతుబజారుకు స్వాధీనం చేశారు. అయితే పెరిగిన ధరల వల్ల విస్తరణ పనులు గత నాలుగేళ్లుగా ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. అదే విధంగా కొత్తపేట, అమీన్ అబ్బాస్‌నగర్ రైతు బజార్లలో కూడా రైతులు మరో వైపు వ్యాపారుల కోసం వివిధ వసతులు ఏర్పాటు చేసేందుకు నిధులు అందించాలని అధికారులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోవడం శోచనీయం. కల్లూరు పారిశ్రామికవాడలో కూడా రైతు బజారు నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లిం చకపోవడం వల్ల ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో ఆ రైతుబజారు ముళ్లకంపలతో నిండిపోయింది. రైతులు ఆందోళన చెందుతున్నారు.


కొత్తపేట రైతుబజారులో కనిపించని రైతులు

ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు

నాణ్యమైన కూరగాయలను ప్రజలకు అందించడం, రైతులకు మద్దతు ధర అందించడం రైతు బజార్ల లక్ష్యం. ఎవరైనా వ్యాపారులు రైతుబజార్లలో కూరగాయలు విక్రయిస్తుంటే.. మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం. రైతులకు అవగాహన కల్పిస్తున్నా రైతు బజారుకు కూరగాయలు తీసుకుని వచ్చి అమ్ముకునేందుకు ఆసక్తి చూపడం లేదు.

- నారాయణమూర్తి, ఏడీఎం

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి


శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 27: శ్రీకృష్ణదేవరాయల 554వ జయంతిని పురస్కరించుకుని శనివారం గౌరీగోపాల్ హాస్పిటల్ వద్ద ఉన్న శ్రీకృష్ణదే వరాయల విగ్రహానికి కాపు, బలిజ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీకృష్ణదేవరాయల జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. శ్రీకృష్ణదేవరాయల పాలనలో రాయలసీమలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారని, అటువంటి మహనీయులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్ర మంలో రిటైర్డు ప్రిన్సిపాల్ కొట్టె చెన్నయ్య, ఆర్జే రామకృష్ణ, చింతలపల్లి రామకృష్ణ, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యుద్ధకళలను నేర్చుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్వీ విజయ మనోహరి, కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 27: స్వీయ రక్షణ కోసం యుద్ధకళలను మహిళలు నేర్చుకోవాలని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి, విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డిలు అన్నారు. శనివారం స్థానిక డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర కిక్ బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఖేలో ఇండియా అస్మిత మహిళల కిక్ బాక్సింగ్ లీగ్ పోటీలను డా.త్రినాథ్, 17వ వార్డు కార్పొరేటర్ పద్మలతారెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయమనోహరి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులు రాణించాలన్నారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకులుగా తెలంగాణ రాష్ట్రం నుంచి చంద్రకాంత్, రాష్ట్ర కిక్ బాక్సింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి నరేంద్ర ఆచారి, రాష్ట్ర కోశాధికారి శామ్యూల్ రాజు, డా.శశిధర్, మాంటి పాఠశాలల ఇన్‌చార్జి కృష్ణయ్య, కిక్ బాక్సింగ్ సంఘం నాయకులు వసీం, మౌలాలి పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం'

కర్నూలు(కల్చరల్), జనవరి 27: తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా మిర్యాలగూడలో నాటక సంస్థ సాంస్కృతిక కళా కేంద్రం ఏటా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పౌరాణిక పద్య నాటక పోటీలకు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' నాటకం ఎంపికైనట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. శనివారం ఈ నాటకోత్సవాల ఎంపిక వివరాలు నిర్వాహకులు తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా ఈ పోటీలు ఈ ఏడాది మార్చి 30 నుంచి ఏప్రిల్ 5 వరకు మిర్యాలగూడలో నిర్వహిస్తుండగా, రాష్ట్రం నుంచి ఐదు నాటకాలను మాత్రమే పోటీలకు ఎంపిక చేశారు. వాటిలో రాయలసీమ నుంచి కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారుల నాటకం ఎంపిక చేయడం విశేషమని పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ నాటకాన్ని టీవీ, సినీ రచయిత పల్లేటి కులశేఖర్ రాయగా నాటకానికి పత్తి ఓబులయ్య దర్శకత్వం వహిస్తున్నారు.

రేపు స్పందన

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 27: కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజల ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 15 కేసులు నమోదు

కర్నూలు, జనవరి 27: నగర శివారులో సుంకేసుల రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ దగ్గర డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన ఈ డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మంది ద్విచక్ర వాహనదారులు, రెండు ఆటోలు, రెండు కార్ల వాహనాల డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకుని వాహనాలు సీజ్ చేశారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు.

మద్యం రవాణా కేసులో ఆటో సీజ్

కర్నూలు(అర్బన్), జనవరి 27: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఆటో తోపాటు 80 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం నగరంలోని పంచలింగాల వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బృందంతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మునసాగాలపాడు గ్రామానికి చెందిన మణికుమార్ అనే వ్యక్తి తెలంగాణకు చెందిన మద్యాన్ని ఆటోలో అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ తనిఖీలో డీటీఎఫ్‌సీఐ నత్తనాయుడు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ సభ

కర్నూలు(కల్చరల్), జనవరి 27: సాహితీ సదస్సు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థల సంయుక్త ఆధ్వ ర్యంలో ఆదివారం పుస్తకావిష్కరణ సభ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు ఎం.లక్ష్మయ్య తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మద్దూరునగర్‌లోని పింగలి సూరన తెలుగు తోట సమావేశ హాలులో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నవ్యాంధ్రుల రాష్ట్ర రచయిత్రుల సంఘం జిల్లా కార్యదర్శి డా.దండె బోయిన పార్వతిదేవి రచించిన రసస్యంధిని, మనలో మాట అనే పుస్తకాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, గాడిచెర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూర హాజరవుతారని తెలిపారు.

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కల్లూరు, జనవరి 27: విద్యుత్ వినియోగదారులు ఆదివారం కూడా కరెంటు బిల్లులు చెల్లించవచ్చని ఆ శాఖ ఇంజినీర్ ఎం.ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగ దారుల సౌకర్యార్థం కర్నూలు, నంద్యాల జిల్లాల కరెంటు బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం కూడా పని చేస్తాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అశోకా కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థినికి పట్టా అందజేస్తున్న ఆర్‌యూ వీసీ

కర్నూలు(కల్చరల్), జనవరి 27: నగర శివారు దూపాడులోని జేఎన్‌టీయూ అనుబంధ అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాల (అటా నమస్)లో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. 2022, 2023 విద్యా సంవత్సరంలో కోర్సులు ముగించిన బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థినులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా రాయలసీమ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ హాజరై ప్రసంగించారు. వివిధ కోర్సు ల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఆయా రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ నవీన్, హెచ్‌ఆర్ విజయ్ క్రిస్టీ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకం

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 27: దేశ భవిష్యత్తులో యువత పాత్ర కీలకమైందని బీజేపీ అధికార ప్రతినిధి పీటీ సాయిప్రదీప్ అన్నారు. శనివారం స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర, భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు మై భారత్-వికసిత్ భారత్ అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బీజేపీ పీటీ సాయిప్రదీప్, నెహ్రూ యువకేంద్ర జిల్లా కోఆర్డినేటర్ రాహుల్, వివేకా నంద స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.నాగఫణిశాస్త్రీలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రఘు, సౌజన్య, అసిస్టెం ట్ ప్రొఫెసర్ దేవకీ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(అర్బన్), జనవరి 27: రాయలసీమ యూనివర్సిటీలోని ఉపకులపతి చాంబర్లో శనివారం పీడీఎస్‌యూ క్యాలెండర్‌ను ఉపకులపతి సుధీర్ ప్రేమ్ కుమార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.భాస్కర్ మాట్లాడుతూ 1974లో ఉస్మానియా యూనివర్సిటీలో ఏర్పడిన పీడీఎస్‌యూ నేటికి 50 సంవత్సరాలు పూర్తవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రమణ, దామోదర్, రవి, సంతోష్, గోపాల్, దేవపాల్, జితేంద్ర పాల్గొన్నారు.

డీఈవోకు సన్మానం


డీఈవో రంగారెడ్డిని సన్మానిస్తున్న డైట్ అధ్యాపకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 27: ఈనెల 31న పదవీ విరమణ కానున్న డీఈవో రంగారెడ్డిని శనివారం డైట్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. డీఈవో రంగారెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో పని చేయడం ఆనందంగా ఉందన్నారు. డీఈవో సేవలను డైట్ ప్రిన్సిపాల్ వసుంధర, అధ్యాపకులు గోవిందు, షంషుద్దీన్, జనార్దన్ రెడ్డి, అయూబ్ కొనియాడారు.

హెడ్ నర్సులకు పదోన్నతి



కర్నూలు(హాస్పిటల్), జనవరి 27: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న ఇద్దరు సీనియర్ హెడ్ నర్సులకు నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా పదోన్నతి లభించింది. శుక్రవారం రీజనల్ డైరెక్టర్ రత్నకుమారి, హెడ్ నర్సులు కె.రాజ్యలక్ష్మీ, జి.అనసూయలకు నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా పదోన్నతు ఉత్తర్వులు ఇచ్చారు. ఇద్దరికి స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2లుగా పోస్టింగ్స్ వేశారు. శనివారం కర్నూలు జీజీహెచ్‌లో హెడ్ నర్సులుగా వారు రిలీవ్ అయ్యారు. అతి త్వరలో ఏర్పాటు కానున్న స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో గ్రేడ్-2లుగా కె.రాజ్యలక్ష్మీ, జి.అనుసూయ విధుల్లో చేరనున్నారు.

ఆర్‌యూ విద్యార్థి ప్రతిభ

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 27: చండీఘడ్ యూనివర్సిటీ మొహాలిలో జరుగుతున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రాయలసీమ యూనివర్సిటీ కర్నూలుకు చెందిన అబ్దుల్లా 61 కేజీల బరువు విభాగంలో ప్రతిభ కనబర్చి కాంస్యం పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్ బీసుధీర్ ప్రేమ్ కుమార్, రెక్టార్ సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానంద్ పుచ్చా, స్పోర్ట్స్ డైరెక్టర్ డా.కేవీ శివకిషోర్‌లు విద్యార్థి అబ్దుల్లాను అభినందించారు.


కాంస్యం పతకాన్ని చూపుతున్న అబ్దుల్లా

దోమలతో అల్లాడుతున్నా పట్టించుకోరా?

టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్


11వ వార్డులోని ప్రజలతో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 27: నగర వాసులు దోమలతో అల్లాడుతున్నా వైసీపీ ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు పట్టించుకోరా? అని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ ప్రశ్నించారు. శనివారం నగంలోని 11 వార్డులో స్థానిక నాయకులు ఏ ర్పాటు చేసిన దోమలపై దండయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం శానిటేషన్ పనులు చేసి దోమలను తరిమికొట్టడంలో వైఫల్యం చెందారని మండి పడ్డారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఉచితంగా తమ ఫ్యాక్టరీ నుంచి హైపో ద్రావణం ఇస్తామని చెప్పినా మున్సిపల్ అధికారులు తీసుకునేందుకు స్పందించడం లేద న్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే అధికారులు స్పందించడం లేదని అర్థమౌ తుంద న్నారు. ఆదివారం నుంచి మౌర్యఇన్‌లో ప్రజలకు ఉచితంగా హైపో అందించా లని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జోహరాపురంలో ఇటీవల 14ఏళ్ల బాలుడు జ్వరంతో చనిపోయా రన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మహబూబ్ ఖాన్, ఈశ్వర్, సలీం, మున్ని, సభా, అనంతయ్య, పెంచ లయ్య, చిన్నమ్మ, ఖాజా, ముస్తఫా పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 27: మునగాలపాడులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ వద్ద శనివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారని, అతని పార్థీవదేహం వెలికి తీసేందుకు అశోక్‌నగర్ ఫిల్టర్ బెడ్స్‌కు తాగునీటి సరఫరా నిలిపివేయాలని వారు కోరినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ తెలిపారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు.

ఉల్లి రైతుల గోడును పట్టించుకోరా?

» ఏపీ రైతు సంఘం
రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 27: ఉల్లి రైతుల గురించి ప్రభుత్వం, మార్కెట్ యార్డు అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం అన్నారు. ఉల్లి రైతుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం రైతులు మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఏటా రైతులు 50వేల ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేస్తున్నారని, గత పది రోజులుగా ఉల్లి ధర పూర్తిగా పతనమై రైతులు ఆందోళన చెందుతున్నారనీ, అధికారులు మాత్రం ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. గరిష్ట ధర క్వింటానికి రూ.1200ల నుంచి కనిష్ట ధర రూ.200లుకూడా రైతులకు దక్కడం లేదని, ఈ దుస్థితికి కారణం కమిషన్ ఏజెంట్లు సిండికేట్ కావడమేనన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉల్లి క్వింటం రూ.3వేలకు పైగానే వ్యాపారులు వినియోగదారులకు అమ్ముకుంటున్నారని, రైతుల నుంచి మాత్రం రూ.1200లకు మాత్రమే అమ్మా లని చెప్పడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి మహేష్, నాగరాజు, సురేంద్ర యాదవ్, మల్లికార్జున, బాబయ్య, దస్తగిరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 27: కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పని చేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని సంఘం గౌరవాధ్యక్షుడు రాముడు డిమాండ్ చేశారు. శనివారం మార్కెట్ యార్డు హమాలీ యూనియన్ నాయకుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులతో కలిసి యార్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి నిర్మల, గౌరవాధ్యక్షులు రాముడు మాట్లా డుతూ యార్డులో కార్మికులకు యూనిఫామ్, మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకుల ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం చైర్మన్ ప్రభాకర్ రెడ్డికి కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి సాయిబాబా, సుధాకరప్ప, ప్రభాకర్, హుశేన్‌వలి, హమాలీ సంఘాల నాయకులు నాగరాజు, వెంకటస్వామి, దస్తగిరి, చిన్నబడేసా, రామకృష్ణ, మనో హర్, వెంకటేశ్వర్లు, మిన్నెల్ల పాల్గొన్నారు.


మార్కెట్ యార్డు ఎదుట ధర్నా చేస్తున్న హమాలీలు

చంద్రబాబు సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గూడూరు, జనవరి 27: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 28న జిల్లాలోని పత్తికొండలో పిలుస్తోంది రా కదిలిరా సభను టీడీపీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ పరిశీలకుడు పెరుగు పురుషోత్తం రెడ్డి, టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ పిలుపుని చ్చారు. శనివారం గూడూరులో మండల టీడీపీ అధ్యక్షుడు ఎల్ సుధా కర్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్రగోపాల్ నాయుడు ఆధ్వర్యం లో నిర్వ హించిన టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథు లుగా టీడీపీ పరిశీలకుడు పెరుగు పురుషోత్తం రెడ్డి, ఆకెపోగు ప్రభాకర్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దండు సుందరరాజు, నాగప్ప యాదవ్, మన్నన్‌బాషా, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, రహిమాన్, సులేమాన్, గిడ్డయ్య, చిలక శ్రీను, గోపాల్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(అర్బన్), జనవరి 27: బోధనేతర ఉద్యోగుల సమస్యలు పరిష్కరిం చాలని నాన్‌టీచింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి.రమేష్ డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలో ఉపకుపతి సుధీర్ ప్రేమ్‌కుమార్‌ను ఉద్యోగులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 ఏళ్ల పూర్తి చేసుకున్న నాన్ టీచింగ్ ఉద్యోగులందరికీ టైమ్ స్కేల్ వర్తింప చేయాలని, ఉద్యోగం నుంచి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, అవుట్ సోర్సింగ్ లో పనిచేస్తున్న వారికి వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో భాస్కరరావు, కే.క్రిష్ణవేణి, జి. రవి, రాజేష్ పాల్గొన్నారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

గూడూరు, జనవరి 27: గోపూజ కార్యక్రమంతో తిరుమల తిరుపతి దేవస్థానం ధార్మిక కార్యక్రమాలు ముగిశాయని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డా.మల్లు వెంకటరెడ్డి అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని చౌడేశ్వరి మాత, దుర్గా మల్లికార్జున స్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. గోపూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 27: కలెక్టరేట్ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని డీఆర్‌ఓ మధుసూదన్ రావు హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని వివిధ శాఖలను తనిఖీ చేశారు. ఆయా శాఖలలో ఉదయం 11 గంటలకు కూడా ఉద్యోగులు విధులకు హాజరుకావడం లేదని అధికారులను ప్రశ్నించారు. సమయపాలన పాటించని ఉద్యో గుల హాజరు పట్టికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏఓ శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

వైసీపీకి చరమగీతం పాడుదాం


మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), జనవరి 27: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో పథకాలపై శనివారం కర్నూలు రూరల్ మండలం జి.సింగవరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగేంద్రనాయుడు, మాజీ సర్పంచ్ నారాయణ, రంగారెడ్డి, డానియేల్, కన్నయ్య, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, కల్నల్, తులిషాపురం సర్పంచ్ గిడ్డయ్య, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల సంరక్షణపై మోదీ దృష్టి పెట్టాలి'


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కర్నూలు(కల్చరల్), జనవరి 27: దేశంలోని ఆలయాల సంరక్షణపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి పెట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం నగరంలో రైల్వే స్టేషన్ సమీపంలో మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి, బాటసారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ దేశంలో అనేక దేవాలయాలు ఆక్రమణలకు గురయ్యాయని, మధుర, జ్ఞానవాపిలపై కూడా ప్రధాని దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీ నాయుడు, బీజేపీ జిల్లా కార్యదర్శి కోటి యాదవ్, అధికార ప్రతినిధి గోరంట్ల రామాంజినేయులు, జిల్లా కోశాధికారి లోకేశ్వరయ్య, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూర్ వలీఖాన్, శ్రీనివాసులు, శివ పాల్గొన్నారు.

కురువలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

కర్నూలు(అర్బన్), జనవరి 27: కురువలకు పార్టీలు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరం లోని ఆ సంఘం కార్యాలయంలో జేఏసీ నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ రవికుమార్, వైస్ చైర్మన్ కురువ శ్రీనివాసరావులు మాట్లాడుతూ కురువలకు ఆయా రాజకీయ పార్టీలు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తిన కిరణ్‌కు మార్, శివలింగం, సురేంద్ర, పరుశురాముడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కురువ జేఏసీ నాయకులు

మంత్రాలయం టికెట్ బీసీలకు కేటాయించాలి

మంత్రాలయం, జనవరి 27: మంత్రా లయం ఎమ్మెల్యే టికెట్ బీసీలకే కేటాయించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాబా, రామ కృష్ణారెడ్డి, అన్నారు. శనివారం మంత్రాలయంలో రామచంద్రపురంలో ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల ఐక్యవేదిక జేఏసీ ఆధ్వర్యంలో రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో పార్టీలకతీతంగా సమావేశమై బీసీలకు ప్రాధాన్యత ఉన్న నియోజకవర్గాన్ని కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దానాపురం శేషన్న, గూడూరు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు వీరేష్, హనుమంతు, గోవిందరాజు, వీరేష్, రఘు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో క్రైస్తవులకు ప్రాధాన్యత కల్పించాలి

ఆదోని (అగ్రికల్చర్), జనవరి 27: రాష్ట్రంలోని క్రైస్తవ మైనారిటీలకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ హక్కుల సమితి కన్వీనర్ హవీలాన్ బాబు, కో-కన్వీనర్ రెవరెండ్ ఎస్ జయకాంత్ క్రిస్టియన్ అన్నారు. శనివారం ప్రేయర్ ఆఫ్ హౌస్ మందిరంలో ఆదోని డివిజన్ క్రైస్తవుల సమావేశం బ్రదర్ బెనర్జీరాజు అధ్యక్షతన జరిగింది. 31న కర్నూలులో జరిగే మహాధర్నాకు భారీగా తరలివచ్చి క్రైస్తవుల ఉనికి చాటుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏసీయూసీఏ అధ్యక్షుడు ఆనంద్ రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, థామస్ పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

దేవనకొండ, జనవరి 27: పత్తికొండలో జరిగే టీడీపీ రా ..కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికలలో జగన్ ఓటమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త సైనికులా పని చేయాలన్నారు. కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ ,బిడిగింజల రంగన్న, మలకన్న పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలి రండి

ఆలూరు/హొళగుంద, జనవరి 27: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం పత్తికొండకు రానున్నారు. బహిరంగ సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ, టీడీపీ మాజీ ఇన్‌చార్జిలు వైకుంఠం మల్లికార్జున , వైకుంఠం శివప్రసాద్, వీరభద్ర గౌడ్‌లు వేరువేరుగా పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు.

● నారా చంద్రబాబు నాయుడు పత్తికొండలో జరిగే రా... కదలిరా బహిరంగ సభకు టీడీపీ కార్యకర్తలు తరలి రావాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఈడిగ గోవింద గౌడ్ శనివారం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీజే పంపాపతి, దిడ్డి వెంకటేష్, దిడ్డి నాగప్ప, రామాంజిని, సిద్దప్ప, మల్లయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆస్పరి: పత్తికొండలో చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న రా.... కదలిరా... బహిరంగ సభకు కార్యకర్తలు తరలి రావాలని ఆస్పరి మండల కన్వీనర్ పరమారెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు.

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి

ఆదోని, జనవరి 27 : రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మ అన్నారు. శనివారం ఆదోని సబ్ కలెక్టర్ వారి కార్యాలయ ఆవరణలో జాతీయ రాహదారి భద్రత వారోత్సవాల భాగంగా వాక్‌థాన్ ర్యాలీని జెండా ఊపి సబ్ కలెక్టర్ ప్రారంభించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి టూటౌన్ పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించారు. అనంతరం భీమాస్ ప్రధాన కూడలిలో సబ్ కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ శివ నారాయణ స్వామి, ఆర్టీవో నాగేంద్ర, మోటార్ వెహిల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు తేజమూర్తి పాల్గొన్నారు.

నాగలదిన్నెలో రీపోస్టుమార్టం

నందవరం, జనవరి 27: మండల పరిదిలోని నాగలదిన్నె గ్రామంలో వడ్ల నారాయణమ్మ మృతదేహానికి పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రీ పోస్టు మార్టం నిర్వహించారు. గత ఐదు నెలల క్రితం నారాయణమ్మ సోదరుడు పంపన్న ఆచారి ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. కొంత కాలంగా నారాయణమ్మ ఒంటరిగా ఇంట్లో ఉంటూ అనారోగ్యంతో మృతి చెందింది. అయితే మృతి పట్ల అనుమానం ఉందని ఆచారి ఫిర్యాది మేరకు శవాన్ని వెలికి తీసి ప్రభుత్వ ఆసుపత్రి ఫోరెన్సీ డాక్టర్ బ్రహ్మాజీ రీపోస్టుమార్టం నిర్వహించారు. వీరితోపాటు డీఎస్పీ సీతారామయ్య, ఎస్ఐ తిమ్మయ్య ఉన్నారు.

టీడీపీ కోసం పని చేస్తా: తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, జనవరి 27: టీడీపీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని తుగ్గలి నాగేంద్ర అన్నారు. శుక్రవారం రాత్రి అమరావతిలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ఆయన నివాసంలో మాజీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ వరలక్ష్మిలతోపాటు కుటుంబ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి కొద్దిసేపు చర్చించారు. భవిష్యత్తులో పేదల కోసమే తమ జీవితాన్ని అంకితం ఇస్తామని, అనివార్య కారణాల వల్ల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నానని, ఇప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కూడా తమకు అండగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు. నేడు పత్తికొండలో జరిగే బహిరంగ సభకు భారీ ఎత్తున తరలి వెళ్లతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ విజయభాస్కర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబునాయుడుతో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర దంపతులు

ఆదోని అభివృద్ధే ధ్యేయం

ఆదోని, జనవరి 27 : అదోని నియోజవర్గ అభివృద్ధే ప్రధాన ధ్యేయమని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం శ్రీకాంత్ రెడ్డి స్వగృహంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు అవుతున్నా అభివృద్ధి శూన్యమన్నారు. ఆదోనిలో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని, హామీలు ఇచ్చే ప్రభుత్వం తమకొద్దని, పని చేసే ప్రభుత్వమే కావాలన్న ఉద్దేశంతోనే టీడీపీలోకి చేరానన్నారు. ఆదోని వెనుకబాటుతనం గురించి 15 నిమిషాల పాటు చంద్రబాబు నాయుడుకు వివరించానని, చంద్రబాబు కూడా అభివృద్ధిపై తనకు హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రాన్ని, ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించే తెలుగుదేశం పార్టీని గెలిపించుకుని, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు పాలన చేపడతారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఉమ్మి సలీం, బుద్దారెడ్డి, రామకృష్ణ, జగదీష్, రవి, బద్రి పాల్గొన్నారు.